## మా యితర ప్రచురణలు

1. అవధూత లీల - శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర - 40.00
2. అవధూత బోధమృతం - శ్రీవారి బోధలు 15.00
3. స్వామి సన్నిధి - శ్రీవారితో వారి సేవకుల అనుభవాలు 15.00
4. అవధూత లీల (ఇంగ్లీషు) ---------- 30.00
5. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (ఇంగ్లీషు) ---- 3.00
6. స్వామి కృప (తెలుగు) -------- 1.50
7. దివ్యలీలలు ---------- 1.00
8. మౌన బోధ ---------- 1.00

**స్వామి కృప పబ్లికేషన్స్ - గొలగమూడి (వయా)**

**సర్వేపల్లి - 524 321. నెల్లూరు జిల్లా**

### గమనిక

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు వ్యక్తుల పేర్లతో పంపరాదు. టు ది రిసీవర్ - శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం, గొలగమూడి (పోస్టు) (వయా) సర్వేపల్లి నెల్లూరు జిల్లా - 524 321 అనే అడ్రసుకు పంపవలెను.


# పిలిచిన పలికే దైవం

## భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి - గొలగమూడి



సేకరణ : పెసల సుబ్బరామయ్య

వెల : రూ 1-50 పై



మాస్టారి ఆశీస్సులతో......

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం, నాగులవెల్లటూరు గ్రామంలో సొంపల్లి పిచ్చమ్మ, పెంచలనాయుడు అనే పుణ్యదంపతులకు జన్మించారు. చిన్ననాటి నుండి ఎంతో ధర్మప్రవర్తన గలవారు. అసత్యం పలికి ఎరుగరు. ఇరవై సంవత్సరముల వయసువరకు పిచ్చి వెంకయ్య అనే పేరుతో సేద్యము పనులు చక్కగా చేసేవారు. అకస్మాత్తుగా ఇల్లువదలి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు వీరికొరకు చుట్టుప్రక్క గ్రామాలు వెతికి ఆశవదిలేశారు. ఐదుసంవత్సరాల తర్వాత శ్రీ వెంకయ్యస్వామి వారు అనే పేరుతో ప్రక్క గ్రామాలలో తిరిగి ప్రత్యక్షమయ్యారు. పేరు మోసిన వైద్యుల వల్లనయంగాని జబ్బులను మాట మాత్రం చేత నయంచేస్తుండేవారు. ఏకాంత ప్రియులుగా అడవులలో తిరుగుతుండేవారు, నిరతాగ్నిహోత్రిగాను కొన్నాళ్ళు వేలిముద్రలు వేస్తుండేవారు. అగ్నిహోత్రం ముందు కూర్చొని "ఓం నారాయణ ఆదినారాయణ" అనే మంత్రం చెబుతూ తంబుర వాయించుతుండేవారు. కొన్నాళ్ళు పెన్నానది నీటి ప్రవాహమునకు ఇసుకతో కట్టలేస్తుండేవారు. అటు తర్వాత అనేక గ్రామములు సంచరిస్తుండేవారు. గొలగమూడికి ఎక్కువగా వస్తూపోతుండేవారు. చివరకు గొలగమూడిలో 1982 ఆగష్టు 24వ తేది మహాసమాది చెందారు.

1985వ సంవత్సరం వరకు తన మహిమను రహస్యంగానే ఉంచుకున్నారు. క్రమేణా తాను వచ్చినదే దీనజనోద్ధరణకొరకని చాటుతూ ఊహకందని దివ్యలీలలు ప్రదర్శిస్తున్నారు.

> శ్రీ స్వామివారి కృపను పొందిన భక్తుల అడ్రసులు ఇవ్వబడ్డాయి. శ్రద్ధగలవారు విచారించి తెలుసుకొనవచ్చును. ఇవన్నీ గాలి కబుర్లని చెప్పి విశ్వాసము గల వారికి కూడ అనుమానపు బీజాలు నాటడం త్రాగేనీటిలో విషంకల్పడంలాంటిదే.

పశ్చిమ గోదావరి జిల్లా, యలమంచిలి మండలం కంచుస్థంభం పాళెం వాస్తవ్యులు శ్రీ కంచుస్థంభం వెంకట స్వామి నాయుడుగారు తనదివ్యానుభవాన్ని ఇలా చెపుతున్నారు. మా కొమార్తె సుజాతను అమలాపురం వాస్తవ్యులు కలిగినేడి సత్తిన్ననాయుడు, న్యాయవాది - గారికి ఇచ్చాము. ఈమెకు ఐదుసంవత్సరాలు, మూడుసంవత్సరాల ఇద్దరు బిడ్డలు. 1986వ సం॥ లో అనారోగ్యమై అన్నంతినలేక తింటే కక్కేది చాలా నీరసమైపోయింది. కొన్నాళ్ళు హైదరాబాద్‌లో వైద్యము చేయించాము. ఏమాత్రము గుణము కనిపించనందున మద్రాసులో వైద్యము చేయించాము. మెదడులో కణిత ఉందని దానిని ఆపరేషన్ చేసే వీలులేదని మందులు, కరెంటువైద్యము చేశారు. ఏమీ నయంకాలేదు. అప్పుడు భోపాల్‌లో ఏదో మూలికావైద్యం చేయించాము. ఏ మాత్రము గుణము కనిపించలేదు. అమ్మాయి ఎముకల గూడైఉంది. అన్నీ మంచంలోనే జరుగుతున్నాయి. డాక్టర్లు ఆశవదిలేశారు. ఈ వైద్యాలన్నింటికి నాలుగులక్షల రూపాయలు ఖర్చయ్యాయి.

విజయనగరం శ్రీనందగిరి సుందరరావు గారి బలవంతంపై గొలగమూడి వచ్చి శ్రీస్వామివారిని శరణువేడాము. నాలుగు రోజులు మాత్రమే గొలగమూడిలో ఉండి ఇంటికి వెళ్ళాము. అంతవరకు మంచములో లేచి కూర్చోలేని ఆమె తనకైతానే గోడపట్టుకొని నడవసాగింది. ఈ మార్పుకు చాలా ఆశ్చర్యపోయి మేము గ్యాసు స్టౌలు తో సహాతెచ్చుకొని గొలగమూడికి వచ్చాము.

అప్పుడు ఆమె పరిస్థితిచాలా దయనీయంగా ఉంది. మందిరం లోకి ఆమెను మీపుమీద మోసుకొచ్చాను. ఊహకందని చిత్రం జరిగింది. నాలుగవనాటికి కొద్దిగా నడవగలిగి ఆహారం తినడం ప్రారంభించింది. నలభైరోజులు శ్రీ స్వామి వారికి కృతజ్ఞతతో ప్రదక్షిణలు చేస్తూ గొలగమూడిలోనే ఉండి పోయాము. జీవించే ఆశలేని ఆమెకు తిరిగి పునర్జన్మ నిచ్చారు శ్రీస్వామి వారు. పూర్తి ఆరోగ్యవంతురాలుగా ఇంటికి తీసుక పోయాము. అదిమొదలు అప్పుడప్పుడు వచ్చి శ్రీ స్వామివారిని సేవించుచున్నాము. ఎన్ని జన్మలకైనా వారి ఋణం తీర్చుకోలేము.

గూడూరు - స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా - మేనేజర్ శ్రీ పి.ఆర్.కె. ప్రసాద్‌గారి భార్య పి. అరవిందదేవి గారు ఇలా చెపుతున్నారు. మేము నెల్లూరులో ఉన్నన్నిరోజులు తరచుగా గొలగమూడి వెళ్ళి శ్రీ వెంకయ్యస్వామి వారిని సేవించే వాళ్ళము. నాకు రెండుపెద్ద

సమస్యలుండేవి. (1) మా వారికి సోరియాసిస్ వలన తలలో చుండ్రువలె పొట్టు లేచేది. విపరీతమైన జిలుండేది. పేరుగాంచిన స్పెషలిష్టు డాక్టర్ల దగ్గర వైద్యంచేయించి వేలరూపాయలు ఖర్చు చేసినా గుణం కనిపించలేదు. చివరకు నేను ఆఫీసుకు పోలేను అనే పరిస్థితికి వచ్చారు. (2) మా పెద్దమ్మాయికి ఎన్నోసంబంధాలు వచ్చాయి. కానీ ఒక్కటీ కుదరలేదు. నా పారాయణలు, పూజలు ఫలించలేదని బాధ. ఒక మిత్రుని సలహాపై ఇంటిలో ఒకవారం అఖండనామ సంకీర్తనచేశాను. ఈ నామ సంకీర్తన శ్రీ స్వామి వారి దయవలన విజయవంతంగా నెరవేరింది.

ఒక రోజు మధ్యహ్నాం 21/2 గం॥ - 3 గం॥ మధ్య కుర్చీలో కూర్చొని శ్రీస్వామి వారి చరిత్ర చదువుతూ కళ్ళుమూశాను. ఒక దివ్యమైన స్వప్నం వచ్చింది. నా స్వప్నంలో తొమ్మిది నెలల పిల్లవాడు దోగాడుతూ మా ఇంట్లోకి వస్తున్నాడు. నేనా బిడ్డను ఎత్తుకొని నీవెవరు బాబూ? అంటూ ఆ బిడ్డ వైపుచూచాను. ఆ బిడ్డకు మాట్లాడే వయసు లేదు. కాని "వెంకయ్య, వెంకయ్య అంటూ ఆమేషా గొలగమూడి వస్తుంటావే నేనెవరో తెలియదా?" అని అన్నాడు. అంతచిన్న బిడ్డ అంత స్పష్టంగా మాట్లాడడంతో నేను ఆశ్యర్యంలో మునిగిపోయాను. వెంటనే నేను "స్వామి! మావారి ఆరోగ్యం అలా అయిపోయిందే ఎల్లాస్వామీ? అన్నాను. "ఓస్ అదేముంది, పొమ్మంటే పోతుందిలే" అన్నారు. మరి అమ్మాయి పెండ్లి విషయం ఎల్లాస్వామీ? అని అడిగాను. "మొదట అబ్బాయే మీ ఇంటి కొస్తాడు. త్వరలో పెండ్లి అయిపోతుంది" అని అన్నారు. వెంటనే మెలకువ వచ్చింది. శ్రీ స్వామి వారిమాటలు వినిపించినందుకు సంతోషము. అది స్వప్న మైనందుకు నిరుత్సాహముగా ఉంది.

ఈ స్వప్నానంతరం మూడవనాడు తిరుపతి వెళ్ళి తిరిగి వస్తున్నాము. మా వారి స్నేహితులొకరొక మందిచ్చి తలకుపూయమన్నారు. ఒకే పూతతో అన్నాళ్ళు బాదించిన సోరియాసిస్ అంతులేకుండా పోయింది. ఇదికేవలం శ్రీ స్వామి వారి కృపమాత్రమేకాని మందు ప్రభావంకాదు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు మాక కాబోయే అల్లుడే ముందు ఫోనుచేసి ఇంటికి వచ్చి అమ్మాయిని చూచి వెళ్ళి తన వారిని పంపించాడు. చిత్రంగా అదే సంబంధం కుదిరింది. జాతకాలు చూచిన శాస్త్రజ్ఞులు ఈ వివాహం జరుగదన్నారు. శ్రీ స్వామి వారి నిర్ణయానికి తిరుగేముంది. లక్షణంగా వివాహం జరిగింది. ఇద్దరు మగ బిడ్డలు కలిగారు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉన్నారు. ఆనాటి స్వప్న దర్శనమే లేకుంటే పైరెండు అనుభవాలలోను నాకు శ్రీ స్వామి వారి కృప అర్థమయ్యేదికాదు. నా భక్తి విశ్వాసాలు పెంపొంద జేసేందుకే శ్రీ స్వామివారు స్వప్న దర్శనమిచ్చారు.

ఊహకందని దివ్యలీల ద్వారా నన్నుద్ధరించిన కరుణామయుడు. మేము 1999 ఫిబ్రవరి 10తేది మాకొమారుణ్ణి అమెరికా పంపేందుకు విమాన మెక్కించాలని బెంగుళూరు వెళ్ళాము. అక్కడ మా చిన్నకొమార్తె తన రవ్వల కమ్మలు, మాటీలు ఇరవైవేల రూపాల విలువచేసే వాటిని భద్రపరచమని నాచేతికిస్తే నేను వాటిని నాహేండ్‌బేగ్‌లో వేసుకున్నాను. తర్వాత రోజుమేము తిరుపతికి వచ్చినప్పుడు ఆమెతన మాటీలు, కమ్మలు అడిగింది. అవి నాహేండ్‌బాగ్‌లో లేవు. వెతికేటప్పుడు ఆ హేండ్‌బాగునకు మూడంగుళముల పొడవునకుట్లుపడక రంధ్రముంది. ఈ రంధ్రంగుండా అవి ఎక్కడో పడిపోయాయి. ఈ కమ్మలు మాటీలు దొరికితే శ్రీ స్వామి వారిచరిత్ర ఏడుమార్లు పారాయణ చేస్తానని చెప్పుకొని బెంగుళూరులోని మా కోడలుకు ఫోనుచేసి ఇల్లంతా వెతకమన్నాను. అవి ఇంట్లో ఎక్కడా పడలేదని ఎక్కడో పోయిఉంటాయని ఒకగంట తర్వాత కోడలు ఫోనుచేసింది.

మేము తిరిగి గూడూరు వచ్చేశాము. నాలుగవ రోజు పాతడైరీలు వేసే పెట్టెతెరచి డైరీ కోసం వెతుకుతుంటే మాటీలు, కమ్మలుగల చిన్నపెట్టె అందులో ఉంది. నేను వాటిని విడిగానే నా హేండ్‌బాగ్‌లో వేసుకున్నాను. కాని ఇప్పుడవి భద్రంగా చిన్న ఆభరణాల పెట్టెలో పెట్టి డైరీలుగల పెట్టెలో ఉన్నాయి. ఆ చిన్న పెట్టెలో మాటీలు కమ్మలు చూచి నిలువునా స్థంభించి పోయాను. ఈ దివ్యలీల తలచుకొంటే శ్రీస్వామి వారికృపకు నేను అర్హురాలనేనా? అని అన్పిస్తుంది. సత్యం, ధర్మం తప్పకుండా సద్గురుని సేవించు అనే వారి ఆజ్ఞను ఆచరించే శక్తినిమ్మని శ్రీ స్వామి వారిని ప్రార్థిస్తున్నాను.

ఇసనాకుల రమణయ్య - 10వ అడ్డరోడ్డు, బాలాజీనగర్ నెల్లూరు ఇలా వివరిస్తున్నారు - నేను 1997వ సం॥ లో ఒకరోజు శ్రీ స్వామివారి దర్శనార్థం గొలగమూడికి వస్తుంటే మావీధిలో కాపురమున్న కె. మునిగోపాలక్రిష్ణ రిటైర్డ్ డి.సి.టి.ఓ గారు నాకు ఎదురొచ్చి "సార్! నాకు శ్రీస్వామివారి ఉధి తెచ్చిపెట్టండి అని అడిగారు. ఆ రోజు వర్షముగా ఉన్నందున ఉధీ తీసుకపొయ్యే మాట మరచి పోయి వెళ్ళాను. తెల్లవారి మునిగోపాలక్రిష్ణగారు కనుపించి "అయ్యా తెచ్చిన వాడివి నాకు చెప్పకూడదా?" అన్నారు. "ఏమిటిసార్ నేను తెచ్చి మీకు చెప్పనిది?" అని అడిగితే "రాత్రి నీవు విభూతి, కుంకుమ తెచ్చి మావరండా గ్రిల్స్‌లో పెట్టి పోయావుగదా! తెల్లవారి మాశ్రీమతి ఆపొట్లాలు నాకు ఇచ్చారు" అని చెప్పారు. నిజానికి నేను ఉధీతీసుక వెళ్ళి అక్కడపెట్టనేలేదు. ఆఉధీ ఘుమ, ఘుమలతో ఎంతగానో ఘుమాళిస్తుంది. నాపై శ్రీ స్వామి వారికెంత దయో చూడండి.

మానవుల వీశ్వాసాన్ని అభివృద్ధిచేయడం, విశ్వాసం లేనివారికి విశ్వాసం కలిగించడం శ్రీ స్వామివారి అవతార కార్యం. కానీ ఎట్టి పరిస్థితులలో గూడా ఉన్న విశ్వాసాన్ని పోగొట్టే ప్రసక్తే లేదు. పి.వి.సుమతి - నాకొమార్తె. ఈమె అనుభవం ద్వారా శ్రీ స్వామివారు అందరికీ మంచి పాఠం బోధిస్తున్నారు. పి.వి. సుమతి తన అనుభవం వివరిస్తుంది.

నేను ఫార్మసీలో డిప్లమా చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న రోజులవి. ఒక సంవత్సరమైనా ఉద్యోగం రాలేదు. శ్రీ స్వామివారికి ఇలా చెప్పుకున్నాను. ఒక వారంరోజులు చిన్న టీ కప్పునిండా అన్నం కూర పెరుగు అన్నీ కలిపి తింటాను. ఉదయం సాయంత్రం కాఫీత్రాగుతాను. టిఫిన్ కూడా తినను. వారంలో మీ చరిత్ర పారాయణ పూర్తి చేస్తాను. గొలగమూడిలోని సమాది మందిరానికి నిత్యం నూట ఎనిమిది ప్రదక్షిణలు చేస్తాను. వారం రోజుల లోగా ఉద్యోగం రావాలి. అల్లారాకుంటే ఇక మీ పారాయణ, పూజలు వృథాయని జీవితాంతం వాటిజోలికే పోనని చెప్పుకొని మొదలు పెట్టాను. ఉద్యోగం రావాలంటే వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటాయని అవివారం రోజులలో కావని ఆసమయంలో నాకు తలంపుకు రాలేదు.

అంతకు ముందు ఒక సంవత్సరం నాడు ఒక డిపార్టుమెంటుకు అప్లైచేశాను. కానీ వారి నుండి జవాబులేదు. చిత్రంగా నేను సాయంత్రం దీక్షవిరమిస్తాననగా ఉదయమే 89 రోజులు టెంపరరీగా ఉద్యోగమిచ్చి జాయిన్ కమ్మని ఆర్డరు వచ్చింది. ఆ ఉద్యోగంలో పర్మినెంట్ చేయించుకునే ప్రయత్నంలో ఆఫీసుకు పోతే - టెంపరరీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఆర్.ఎమ్.యస్.లో వేయించారని గనుక మాకు మినిష్టర్ల రెకమండేషన్ ఉందని గుమస్తాలు చెప్పారు. నిజానికి ఆర్.ఎమ్.యస్.లో వేయించకుంటే ఆర్డర్లు ఆ ఉదయం నాకు చేరదు. అదే ఆర్డరు తర్వాత రోజు వచ్చినా నేను శ్రీ స్వామివారిని నమ్మను. నా విశ్వాసాన్ని బలపరిచి ఆజన్మాంతము నన్ను వారి పాదాలకు కట్టివేసుకున్నారు.

శ్రీ వేమినేటి శివరామయ్య - ఉచ్చూరు గ్రామం - వయా సూళ్ళూరు పేట, నెల్లూరు జిల్లా - వారు బ్రాంచి పోష్టు మాష్టరుగా పనిచేస్తున్నారు. "వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది" అని చెప్పిన శ్రీ స్వామివారి మాట వీరి అనుభవంలో యథార్థమైంది. నెలల తరబడి శ్రీ స్వామివారిని సేవించిన వారు పొందలేని స్వప్న సందేశం కొన్ని రోజుల సేవకే పొందిన ధన్యజీవి.

1988 సం॥ వివాహమై ఐదుసంవత్సరముల వరకు సంతానం లేకుంటే శ్రీ స్వామివారి నాశ్రయించగా మగబిడ్డ కలిగాడు.1996 సం॥ లో నా గుండె క్రింద నొప్పి వచ్చింది. మద్రాసులో ఒక స్పెషలిష్టు డాక్టరు దగ్గర వైద్యం చేయించాను. మూత్రపిండాలలో జబ్బని తేల్చి మూత్రపిండాల స్పెషలిష్టు దగ్గరకు పంపారు. ఈడాక్టరు పరీక్షచేసి పప్పులు, మాంసము తినరాదని మూడు మార్లు ఉడకబెట్టి నీళ్ళువంచిన ఆకుకూర, కాయకూరలే తినాలి. ప్రతినెలా పరీక్ష చేయించుకోవాలన్నారు. యాభైవేల రూపాయలు ఖర్చు అయింది కాని నాబాధలు ఏమాత్రమూ తగ్గలేదు.

సంగం దగ్గర తరుణవాయి లోని మస్తాన్‌వలీ ఔలియా దగ్గర రెండునెలలా ఇరవైరోజులు సేవచేసినా నయంకాలేదు. బాధలు భరించలేక మరలా మద్రాసుకే పోయాను. ఈ డాక్టరు నన్ను కిడ్నీ పరీక్షకొరకు అపోలోఆస్పత్రికి పంపారు. స్కానింగుతో సహా పరీక్షలన్నీ చేశారు. వీళ్ళు

కూడా దెబ్బయి అయిదు గ్రాముల అన్నము మూడు మార్లు ఉడికించిన కూరతింటూ నెలకు పద్నాలుగు వందల రూపాయల మందులు తింటుంటే కాలం గడుస్తుందని చెప్పారు. ఒక్క సంవత్సరం వీరి వైద్యంచేయించినా నాబాధలు గోరంతకూడా తగ్గలేదు.

1996 నుండి 1998 వరకు అప్పులుచేసి అరవైవేలరూపాయలు ఆస్పత్రికి పెట్టాను గాని శ్రీస్వామి వారికి ఒక్క సాంబ్రాణి కడ్డీకూడా వెలిగించలేదు. 1998 ఏప్రిలు నెలలో శ్రీ స్వామి వారే నామనసును వారి వైపు త్రిప్పుకున్నారు. ప్రతినెలా 333 రూ. హుండీలో జీవితాంతం సమర్పిస్తానని నన్నిక మద్రాసు పోకుండా కాపాడమని మొక్కుపెట్టుకొని భార్యాబిడ్డను తీసుకొని గొలగమూడి వచ్చేశాను. అక్కడే ఉండి శ్రీ స్వామిని సేవిస్తున్నాను. ఒకనాడు నాభార్య స్వప్నంలో 1వతే॥ పూజకు కట్టమని ఆదేశించారు. అలాగే కట్టాను. కానీ నా ఆరోగ్యం బాగుపడలేదు. మరలా పద్నాలుగువం.లు ఖర్చుపెట్టి మద్రాసు వెళ్ళివచ్చాను. విసిగిపోయి చచ్చినా, బ్రతికినా ఇక మద్రాసు పొయ్యేది లేదని హృదయపూర్వకంగా తీర్మానించుకున్నాను. ఇక నీ తీర్థము విభూతే నా మందులని కన్నీటితో విన్నవించాను. ఆనాటి రాత్రే "ఉప్పులేకుండా ఒక్క పూట అన్నం తినయ్యా" అని శ్రీ స్వామివారు ఆదేశించారు. కానీ ఆ ఆదేశాన్ని పాటించకుండా ఐదునెలలు బాధపడ్డాను. అనంత కరుణామయుడు నా అజ్ఞానాన్ని క్షమించి ఒక స్వప్నమును అనుగ్రహించారు. అందులో నేనొక ఎద్దు వలన చనిపోబోతుంటే తప్పించుకున్నాను. అదిమొదలు ఉప్పులేకుండా తినమన్నసందేశం పై నా మనస్సు కేంద్రీకృతమైంది. ఉప్పులేకుండా ఒక్కపూట భోజనం తినమొదలు పెట్టగానే ఆరోగ్యం బాగుపడసాగింది. ఆకలికి తట్టుకోలేక రాత్రి పూట జావత్రాగాను. అలా త్రాగవచ్చోలేదోనని శ్రీ స్వామివారి పటంముందు ఏడ్చేశాను. ఆనాటి రాత్రి శ్రీ స్వామివారు నాస్వప్నంలో "తినయ్యా" అని చెప్పారు. అజ్ఞానం వలన ఉప్పులేకుండా రెండు పూటలూ భోజనం చేయసాగాను. వెంటనే మరలా నాబాధలు మొదలయ్యాయి. నా విషయం వినిన మరొక మిత్రుడు ఉప్పులేకుండా అన్నం తినకుండా వేరే ఇడ్లీగాని దోశగాని తినిచూడమన్నాడు. ఆవిధంగా రాత్రి అన్నం మానివేసి ఇడ్లీ, దోశ ఉప్పులేకుండా తినసాగాక ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాను. వారి సందేశాన్ని అజ్ఞానం వలన ఆచరించలేకపోయినాగాని ఆప్రేమమూర్తి నా కన్నీటి ప్రార్థనకు కరిగిపోయి నన్ను రక్షించారు. జన్మజన్మలకు వారి రుణం తీర్చుకోలేను. ప్రతివారం గొలగమూడి వచ్చి శ్రీస్వామివారిని సేవించేటట్లు చేయమని వారిని ప్రార్థిస్తున్నాను.

శ్రీ అవధానం రామమూర్తిగారు - పిచ్చిరెడ్డితోపు, నాయుడుపేట శ్రీ స్వామివారి కృప ఇలా వివరిస్తున్నారు. 1989వ సం॥ లో నా ఎడమచెయ్యి నాస్వాధీనం తప్పింది. ఏ వస్తువు పట్టుకున్నా చెయ్యి వణుకు. మంచినీళ్ళ గ్లాసుకూడా పట్టుకొని త్రాగలేను. చిన్నప్పటినుండి ఎడమ చేతితో పేనాపట్టుకొని వ్రాసే అలవాటు. ఇప్పుడు బొత్తిగా వ్రాయలేకుండా ఉన్నాను. నేను ఎలిమెంటరీ స్కూలు టీచరును గనుక ఎంతో వ్రాతపని ఉంటుంది. చేయలేకున్నాను. మద్రాసులో పేరుమోసిన న్యూరోసర్జన్ దగ్గర వైద్యం చేయించినా నయంకాలేదు. మరొక డాక్టరును ఆశ్రయించినా నిరాసే ఎదురైంది. టీచర్‌ను గనుక వ్రాతపని చేయవలసి ఉంటే చేయలేకున్నాను. ఏక్షణాన ఉద్యోగం పోతుందో ననేభయం.

నా స్నేహితులు శ్రీ వెంకయ్యస్వామి వారి దగ్గరకు గొలగమూడి తీసుకవచ్చారు. క్రమంగా పదివారములలో చేయిపూర్తిగా స్వాధీనములోకి వచ్చింది. ఏమందువాడకుండానే శ్రీ స్వామికృపవలన చేయి చక్కబడింది. ప్రస్తుతం చక్కగా వ్రాయగలుగుతున్నాను. చేతికి మామూలు బలం అనుగ్రహించారు. పైఆఫీసర్ల బెడదతప్పింది.

ఈ కృతజ్ఞతా భావంతో గత పదిసంవత్సరాల నుండి ఒక్క వారం విడవకుండా ప్రతివారము నాయుడుపేట అవతలనుండి శ్రీ స్వామివారి దర్శనానికి గొలగమూడి వస్తున్నాను. ప్రతిసంవత్సరము భార్యాభర్తలము నాయుడు పేట అవతలినుండి కాలినడకన (పాదయాత్ర) గొలగమూడి వస్తున్నాము. శ్రీ స్వామి వారికృపవలన ఆదర్శ ఉపాధ్యాయుడుగా రాష్ట్రపతి అవార్డుకూడా లభించింది. శ్రీ స్వామివారి విభూతి లెక్కలేనన్ని చిత్రాలుచేస్తుంది.చేలకు గొప్ప దిగుబడి రావడమే గాక రోగార్తులకు చెప్పనలవికాని విధంగా బాధలు నివారిస్తున్నది. విభూతిని ఊరేగించి వరిపైరుకు చల్లుతున్నాము. చీడపీడల నివారణేగాకుండా దిగుబడికూడా

అత్యధికంగా అనుగ్రహిస్తున్నారు. శ్రీ స్వామివారి సేవలభించడమే గొప్పఅదృష్టం. కృతజ్ఞతాభావంతో వారిని సేవించే బుద్ధికుశలత ప్రసాదించమని శ్రీ స్వామి వారిని వేడుకొనుచున్నాను. కృతజ్ఞతంటే ఎలా ఉండాలో తెలిపేదే వీరి వారంవారం దర్శనాలు, సాంవత్సరిక పాదయాత్రలు.

మా నెల్లూరు మిత్రుని కొమార్తెకు ఇరవైరెండు సంవత్సరాల వయసు. కాన్వెంటు స్కూలులో పనిచేస్తుండేది. వాళ్ళ హెడ్‌మిస్ట్రెస్‌తో ఒకరోజు ఘర్షణపడింది. తెల్లవారి నుండి ఆమె మెదడు పనిచేయడం మానేసింది. ఎవరినీ గుర్తుపట్టలేదు. అన్నం తినదు, నిద్రపోదు. చిన్నచిన్న నాటువైద్యాలు తాయెత్తులు అన్నీ అయిపోయాయి. ఫలితం లేదు. విధిలేక ఒక మానసిక వైద్యునిదగ్గర వైద్యం చేయించసాగారు. అప్పుతెచ్చి అరువేల రూపాయలు ఖర్చు పెట్టారు. ఏమాత్రము గుణం కనిపించలేదు. ఈమె స్కూల్లో పనిచేసి జీతం తెస్తేనే ఇల్లుగడిచేది గగనం. మరిప్పుడు వైద్యానికి అప్పు ఎవరిస్తారు. అప్పుఇమ్మని ఒకరి దగ్గరకు పోతే ఆయన వారిని బలవంతంచేసి గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధికి తీసుకువచ్చాడు. ప్రదక్షిణాలు చేస్తుంటే చిత్రంగా ఏవైద్యం లేకుండా మూడవనాటికి మెదడుపని చేయమొదలు పెట్టి మామూలు మనిషైంది. శ్రీస్వామివారి ఆజ్ఞరాకముందే పదిరోజుల తర్వాత ఇంటికి వెళ్ళారు. మరలా వ్యాధి తిరగబెట్టినందున విధిలేక మరలా శ్రీ స్వామి సన్నిధికి వచ్చారు. ప్రదక్షిణలు చేస్తుటే క్రమంగా ఐదురోజులకు పూర్తి ఆరోగ్యం కలిగింది. ఈ దఫా కూడా స్వామివారి ఆజ్ఞరాకముందే పదిహేను రోజుల తర్వాత ఇంటికి వచ్చేశారు. తిరిగి మరలావ్యాధి తిరగబెట్టింది. మరలా వచ్చి శ్రీస్వామి వారిని సేవించసాగారు. ఈదఫా పదిరోజులకు గాని నయంకాలేదు. నయమైన తర్వాత నలభైరోజులు శ్రీస్వామి వారిని సేవించి వెళ్ళారు. ఆమె ఆరోగ్యంగా ఉంది. ఈమధ్యనే వివాహమై సుఖంగా ఉన్నారు. ఈ కుటుంబమంతా శ్రీ స్వామి వారికి ఆజన్మాంతము ఋణపడియున్నామని చెపుతున్నారు.

నెల్లూరు, గాంధీనగర్ నివాసి ఐతానారాయణగారి అనుభవం, వారి విశ్వాసము భక్తులందరికీ గొప్ప పాఠంగా నిలుస్తున్నాయి. సాధారణంగా ఒక నలభైరోజులు శ్రీ స్వామివారి సన్నిధిలో ఉండి సేవచేయాలంటేనే చాలాగొప్పగా బాధపడిపోయే మనస్తత్వం మానవులది. నెలల తరబడి అకుంఠిత విశ్వాసంతో శ్రీ స్వామివారిని సేవిస్తూ వారి దయకొరకు వేచియున్న అద్భుత గాథ ఇది. నారాయణ గారు ఇలా వివరిస్తున్నారు.

నాభార్య 1992వ సం॥ లో పెండ్లికి పోయి కుడివైపునడుంనొప్పి అని తిరిగి వచ్చింది. ఇంట్లో నిష్కారణంగా పడి నడుంనొప్పి పెద్దదైంది. అదిమొదలు కాలు ముడుస్తుంది. కానీ చాపలేదు. నెల్లూరు గవర్నమెంటు అసుపత్రేగాక మరొక స్పెషలిష్టు దగ్గర వైద్యం చేసినా ఏమాత్రమూ నయం కాలేదు. ఆ తర్వాత ఆయుర్వేదవైద్యం చేసినా ఏమాత్రమూ నయం కాలేదు. నొప్పి తగ్గలేదు. వళ్ళంతా మంటలు వచ్చాయి. ఆ డాక్టరు తనవల్లకాదని తిరుపతి రూయా హాస్పటిల్ పొమ్మన్నాడు. ఆర్థిక ఇబ్బందుల వలన తిరుపతి పోలేదు. మంత్రతంత్రాలు కూడా విఫలమయ్యాయి. నిస్సహాయ స్థితిలో గొలగమూడి శ్రీ స్వామివారిని ఆశ్రయించాము.

ఇప్పుడు ఆమె బొత్తిగా నడువలేదు. ఎముకల గూడుగా తయారైంది. ఆహారం కూడా తినదు. తింటే మలమూత్ర విసర్జనల ఇబ్బందిని భావించింది. పసిబిడ్డను ఎత్తుకున్నట్లు ఎత్తుకొని నేనే ప్రదక్షిణలు చేసే వాణ్ణి, మొదట మొదట అగ్నిహోత్రము దగ్గరకు కూడా రాలేకపోయాము. ఒకటిరెండు ప్రదక్షిణలు చేసే సరికి ఆమె ప్రయత్నం లేకుండానే గుడ్డలలో మూత్ర విసర్జన జరిగేది. ఆ పవిత్ర స్థలంలో ఉండకూడదని ఆమెను బయట కూర్చోబెట్టి ఆమె బదులు నేనే ప్రదక్షిణలు చేసేవాణ్ణి. నెలకొక సారికాకుండా చాలాముందుగానే ఇంటికి దూరమయ్యేది. నలభైరోజులు ప్రదక్షిణలు చేసేందుకు మూడు నెలల కాలం పట్టింది.

శ్రీ స్వామి వారి సన్నిధి చేరగానే వంటిలోని మంటలు లేకుండా పోయాయి. ఇంటికి వెళ్ళి కుర్చీలో పటం పెట్టి ప్రదక్షిణలు చేసేవాణ్ణి. గొలగమూడికి వచ్చి వీలున్నన్ని రోజులుండడం, ఆమె ఇంటికి దూరం

కాగానే వెళ్ళిపోవడం. ఇట్లా ఒక్క సంవత్సర కాలం మొండికేసుకొని తిరిగాను. అప్పుడు శ్రీ స్వామి వారు కరుణించి ఆమెకై ఆమే కఱ్ఱ పట్టుకొని నడువసాగింది. ప్రస్తుతం తన పనులు తాను చేసుకోవడమేగాక మాకు కూడా వంట చేసి పెడుతుంది. కఱ్ఱ సహాయం లేకుండా నడుస్తుంది. ఆ కారుణ్యమూర్తియొక్క శక్తి సామర్థ్యాలు, ప్రేమ, దయ వర్ణించతరముగాదు.

శ్రీ టి.ఎస్.ఎస్. శర్మగారు - పోస్టల్ పెన్షనర్ 1/145/86 పూసల వీది ఎఱ్ఱనుక్కుపల్లి - కడపజిల్లా, ఇలా తెలుపుచున్నారు. మా తమ్ముడు త్రికూటం నటరాజ బాబాద్వారా నేను శ్రీ స్వామి వారి భక్తుడనై గొలగమూడి దర్శించి, నిత్యం శ్రీ స్వామివారిని పూజిస్తూ పారాయణ చేస్తున్నాను.

సెప్టెంబర్ 1998వ సం॥లో నాకుడి మోకాలు విపరీతంగా నొప్పి పుట్టసాగింది. కూర్చోలేను. నడువలేను. ఆర్థిక ఇబ్బందులవలన వైద్యుల చుట్టు తిరుగ లేను: పూజచేసుకుంటూ శ్రీ స్వామివారి చిత్ర పటానికి మొరపెట్టుకొన్నాను. "స్వామీ తమరు ఎందరికో, ఎన్నో వ్యాధులు మాన్పారు. రెండు మూడు రోజులలో నాకీ బాధ తగ్గించక పోతే నేను మీ పూజ కూడా చేయలేను. నా బాధకు ఏ వైద్యము చేసినా మీదే భారమని బాధతో విన్నవించాను.

నాటి రాత్రి నా స్వప్నంలో ఎవరో ఒక ముసలాయన నొప్పిపుట్టే నా మోకాలు పై బలంగా తంతున్నాడు. నేనా స్వప్నంలోనే "ముందేనేను నొప్పి పుట్టి చస్తుంటే ఆ మోకాలు మీద తన్ను తున్నావేమిటయ్యా" అని గట్టిగా అరుస్తున్నాను. ఈ అరుపులకు నాకే మెలుకువ వచ్చింది. స్వప్నమే గదా అని శ్రీ స్వామివారిని ప్రార్థించుకుంటూ నిద్రకొరిగాను. చిత్రాతి చిత్రంగా తెల్లవారి నిద్రలేచేసరికి నా మోకాలు నొప్పి మటుమాయమైంది. ఆ కరుణామయుడు నా ప్రార్థన వింటున్నాడన్న నమ్మకం కలిగి వారిని హృదయ పూర్వకంగా సేవిస్తున్నాను.

సదానందంగారు, మెడికల్‌షాపు, సూళ్ళూరుపేట శ్రీ స్వామివారు తనకు భౌతిక దర్శనం అనుగ్రహించిన విషయం ఇలా వ్రాస్తున్నారు.

నా మమతను చూరగొన్న నా భార్య వియోగం వలన నాకు మానసిక శాంతి కరువై నిరంతరము ఆమె స్మృతులతో పరధ్యానంగా ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. ఒకరోజు మోటార్ బైక్ మీదపోతూ రోడ్డు ప్రక్కన కంపచెట్లలోకి వెళ్ళాను. ఏదైనా వాహనానికి గుద్ది ఉంటే ప్రాణాపాయమై ఉండేది. ఆనాడే మోటారు బైక్ అమ్మేశాను. నిత్యం నాయుడుపేట నుండి సూళ్ళూరుపేటకు సీజను టిక్కెట్టు పై వెళ్ళి ప్యాన్సీషాపునడిపేవాణ్ణి. రైలు తప్పి పోయినప్పుడు లారీలు ఎక్కితే అందులో శ్రీ వెంకయ్య స్వామి వారి పటం చూచి ఈయన లారీ ఓనరా? వేషం బిక్షగానివలె తంబుర, గోచి ఉందే అనుకునేదేగానీ లారీ డ్రైవరును అడిగేది లేదు. ఇదే వ్యక్తి ఒకరోజు రైలులో నా ఎదురు సీటులో తంబుర పట్టుకొని కూర్చొనియున్నాడు. అరే లారీలోని పాటోలోని వ్యక్తి ఇక్కడికొచ్చాడే. ఒక్కపాట పాడడు, డబ్బులు అడగడేమిటి అనే ఆలోచనతోనే నా స్టేషను వచ్చి దిగిపోయాను గాని ఆ వ్యక్తిని పలకరించలేదు. ఆ తర్వాత నా స్నేహితుని బలవంతం పై గొలగమూడి వచ్చి సమాది మందిరంలోని ఫోటోలు చూచి అదిరిపోయాను. నాకు రైలులో కనింపిచిన వ్యక్తియొక్క పెద్ద పెద్ద పోటోలిక్కడెందుకున్నాయని విచారించాను. శ్రీ వెంకయ్యస్వామివారు 1982 ఆగష్టు 24తే సమాది చెందారని - వారు నేటికి కొందరు అదృష్టవంతులకు బౌతికంగా దర్శన మిస్తున్నారని తెలుసుకున్నాను. క్రమంగా నా పరధ్యాన్నం, మానసిక వత్తిడి అదృశ్యమైమామూలు మనిషినయ్యాను. అది మొదలు అమేషా శ్రీ స్వామివారి సమాధిని దర్శిస్తున్నాను.

నేను సరిగా బాడుగ ఇవ్వడంలేదని నా అంగడికొట్టు యజమాని కొట్టు ఖాళీ చేయమని వత్తిడి చేస్తూ, ఒకరోజు నా కొట్టుకు నా తాళానికి మరొక తాళం బుఱ్ఱ తానువేశాడు. నాకొట్టు తాళపు చెవుల గుత్తి శ్రీ స్వామివారి సమాధి మందిరంలో ఉంచి "స్వామీ! మీ ఇష్టమొచ్చినట్లు చేయమని" చెప్పి వెళ్ళి పోయాను. మూడవ నాటికి కొట్టు యజమాని తనకైతానేతన తాళం బుఱ్ఱ తీసుకెళ్ళాడు. కొన్నాళ్ళకు ఆ కొట్టు వదలి మరొక చోట మెడికల్ షాపు పెట్టాను.

ఒక రోజు నేను గొలగమూడిలో నిద్ర చేశాను. నా స్వప్నంలో శ్రీ స్వామివారు నాకొక లడ్డు ముద్ద ప్రసాదించారు. ఆ లడ్డుముద్ద నారెండు చేతులు కలిపి దోసిలి పడితే ఆ దోసిలిలో ఇమిడిపోయింది. అంతపెద్ద లడ్డు పై శ్రీ స్వామివారి వేలిముద్రలున్నాయి. గొప్ప ఆశ్చర్యకరమైన విషయమేమంటే తెల్లవారేసరికి అలాంటి లడ్డు నిజంగానే నా ప్రక్కనుంది. ఈ విషయం నేను నా స్నేహితునికి చెపితే అతడు నమ్మలేదు. ఆ రాత్రి శ్రీ స్వామివారు అతనికి స్వప్న దర్శన మిచ్చి నాకు లడ్డు ప్రసాదించిన విషయం చెప్పారు.

శ్రీ స్వామి వారు నాకనుగ్రహించిన అనుభవాలతో నేను సత్యం ధర్మం తప్పకుండా సద్గురుని సేవించేటట్లునన్ను నడిపించమని శ్రీ స్వామి వారిని నిత్యం ప్రార్థిస్తున్నాను.

కొలిమిలో పెట్టి కాల్చే ఇనుము సరైన పాకం వరకు కొలిమిలో కాలనివ్వాలి. అంతేగాని మధ్యలో తీస్తే మరలా చల్లారిపోయి పనిమొదటి కొస్తుంది. శ్రీ స్వామివారిని సేవించేవారు శ్రీ స్వామివారు ఆజ్ఞాపించినంత వరకు వారి సన్నిధి విడవకుండా సేవచేయాలి. మన కర్మ పూర్తి కాగానే ఆ మహనీయుడు మనలను ఒక్కక్షణం గొలగమూడిలో ఉండనివ్వరు. యరగంటి చెంగయ్య - పాపనేరి గ్రామం పేరినాడు (పో) వయా శ్రీహరికోట - నెల్లూరు జిల్లా వారి అనుభవం చూడండి.

"నా ఆరోగ్యం సరిలేక శ్రీ స్వామి వారి సన్నిధిలో దీక్షగా ప్రదక్షిణలు చేస్తున్నాను. కొన్నాళ్ళకు ఆరోగ్యం బాగుపడింది. కానీ శ్రీ స్వామి వారు నన్ను వెళ్ళమని చెప్పలేదు. మధ్యలో కొందరు మిత్రులు భజన అని చెప్పి ఒక్క రాత్రికి నెల్లూరు తీసుకపోయారు. తెల్లవారి నుండి నా ఆరోగ్యం మరలా దెబ్బతిని మొదటి గతి పట్టింది. చెంపలేసుకొని క్షమాపణ చెప్పుకొని మరలా ప్రదక్షిణలు చేస్తుంటే కొన్నాళ్ళకు బాగుంది. ఒక నాడు శ్రీ స్వామి వారి సేవకుని రూపంలో స్వప్నదర్శన మిచ్చి నన్ను మరొక చోటుకు రమ్మంటున్నారు. కానీ నేను వెళ్ళలేదు. అప్పుడు శ్రీ స్వామివారు నా స్నేహితునికి స్వప్న దర్శనమిచ్చి - "చెంగయ్య ఇక్కడనుండి పొమ్మంటే పోలేదు. నీవైనా చెప్పి పంపించమని" ఆజ్ఞాపించారు. నా స్నేహితుడా విషయం చెప్పగానే నేను తిరిగి మా గ్రామం వెళ్ళిపోయాను. ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నాను. గనుక శ్రీ స్వామివారు ఆజ్ఞాపించే వరకు ఈ పుణ్యభూమి వదలి పోవడం మనకు మంచిదికాదు.

మనకేదైనా ఆపద వచ్చాక శ్రీస్వామివారికి మ్రొక్కుబడి చెప్పుకొని, ప్రదక్షిణలు, పారాయణ చేశాక వారు మనలను కాపాడడం చాలా తక్కువ స్థాయి అనుభవం. మనం ఏమారి ఉన్న సమయాలలో గూడా మనలను వెన్నంటి కాపాడుచుండడం వారినుండి మనం పొందదగిన ఉత్తమ ఫలితమన్నమాట. మన ప్రార్థనతో నిమిత్తంలేకుండా వారు మనలను కాపాడాలంటే సంపూర్ణ శరణాగతితో నిరంతరం వారిని స్మరించుటే మన కర్తవ్యం కావాలి.

చల్లా శ్రీరాములు శెట్టి - క్రిష్ణాపట్నం - నెల్లూరుజిల్లా వారు ప్రస్తుతం శ్రీ స్వామివారి ఆశ్రమంలో వారి సేవలో ఉన్నాడు. శ్రీ స్వామివారి మాల ధరించి దీక్షవిరమించాక తన కాషాయరంగు గుడ్డలు ఎవరైన అర్హులైన వారికి ఇవ్వదలచాడు ఒక భక్తుడు. అతడు తన కాషాయ రంగు గుడ్డలు బలవంతం చేసి చల్లా శ్రీరాములు శెట్టిగారికి ఇచ్చాడు. ఆరోజు రాత్రి శ్రీ స్వామివారు శ్రీరాములు శెట్టి గారికి స్వప్న దర్శనమిచ్చి "యర్రగుడ్డలు కట్టుకున్నట్లు కాదు, అబద్ధం చెప్పకూడదయ్యో" అని ముమ్మారు పలికారు. నేను అబద్ధం చెప్పకుండా ఉండలేననే శ్రీస్వామివారు అలా చెప్పారని తలచి ఆ రంగు గుడ్డలలో కండువ తప్ప మిగిలిన వాటిని మరొకరి కిచ్చి వేశాను. ఆశ వలన ఆ కండువ ను స్నానానంతరము వళ్ళు తుడుచుకోవచ్చని తలచాను. తెల్లవారి స్నానం చేస్తూ ఆ టవల్ అక్కడ కమ్మిమీద వేశాను. నేనక్కడే ఉన్నాను. స్నానం చేశాక చూస్తే ఆ కండువా అచ్చట లేదు. ఈ రంగు గుడ్డనేను వాడకూడదని శ్రీ స్వామివారు అలా చేశారని తలచి నన్ను పాపభారంనుండి రక్షించిన శ్రీ స్వామివారికి కృతజ్ఞతతో నమస్కరించాను. ఈ చల్లా శ్రీరాములు శెట్టిగారే ఇలా చెపుతున్నారు.

మనం శ్రీ స్వామివారిని అర్థించకున్నాసరే మనకవసరమైన సందేశాలిచ్చి మనలను సరైన బాటన నడిపిస్తారు. కావలసిందల్లా వారి ఎడల మనకు హృదయ పూర్వకమైన విశ్వాసము మాత్రమే.

ఏ మంత్రం జపిస్తే ఉత్తమ ఫలితముంటుంది. కేవలం ఓంకారమేనా లేక ఓం నారాయణ ఆదినారాయణ అనే మంత్రం జపించడం మంచిదా? అనే సందేహం చాలాకాలంగా నన్ను వెంటాడుతుంది. ఎందరినో అడిగాను గానీ సంతృప్తికర మైన సమాధానం లభించలేదు. ఒకనాటి నా స్వప్నంలో శ్రీస్వామివారు నా సందేహ నివృత్తి చేశారు.

నా స్వప్నంలో నేను భజనచేసే వారిలో ఎవరినన్నా నా సందేహము గురించి అడగాలని వెళ్ళాను. నేను చూస్తుండగనే భజన చేసిన వారందరూ వెళ్ళి పోయారు. సరే రేపైనా అడుగుదామని అనుకుంటూ భజన జరిగిన చోటు వైపుచూస్తే అక్కడ శ్రీమల్లిక వెంకయ్యగారు కూర్చొని ఉన్నారు. నా సందేహం గురించి వీరి నడిగితే ఈయన చెప్పగలడా? కట్టెలు కొట్టే ఈయనకు ఇలాంటి విషయాలు ఎలా తెలుస్తాయని మదన పడుతున్నాను. నేనేమీ అడగకనే ఆయన "ఓం అంటే సరిపోతుండ్లాయ్యా ఓం అంటే బాగుంటుంది. ఓం అనుకో మంచిదే" అని ముమ్మారు పలికి అధృశ్యమయ్యారు. అరే వెంకయ్యలేడే ఎట్లాపోయాడు అని స్వప్నంలో అనుకొంటున్నాను. నాకు మెలుకవ వచ్చింది. అప్పటికి గుర్తొచ్చింది- మల్లిక వెంకయ్య సమాధి చెంది అప్పటికి నాలుగు సంవత్సారాలైందని. ఈ రూపంలో శ్రీ వెంకయ్యస్వామి వారే నాకు స్వప్నదర్శనమిచ్చి నేనడగకుండా నా సందేహంనివృత్తి చేశారు. మనకవసరమైనది సమకూర్చడమే సద్గురుని కృప. వారి కృపకు అర్హుడనయ్యే విధంగా నన్ను నడిపించమని శ్రీ స్వామి వారిని ప్రార్థిస్తున్నాను.

మన ప్రార్థనతో సంబంధం లేకుండా శ్రీ స్వామివారు మన అవసరానికి ఆదుకోవడమనేది ఒక గొప్ప విశేషము. ఒకరోజు ఇంటినిండా అతిధులు పడుకున్నారు. నేను నాకుమారుడు దేవుని గదిలో పడుకున్నాము. ఆ గది చాలా ఇరుకైనది. నా కొమారుణ్ణి గోడ వైపు పడుకోబెట్టి నేను దేవుని పటాలవైపు పడుకున్నాను. నా కొమారుడు వళ్ళు తెలియకుండా నిద్రబోయే స్వభావం కలవాడు. అర్ధరాత్రి వేళ నా కొమారుడు నన్ను నిద్రలేపి ఇక్కడ తేలువుంది జాగ్రత్తగా పైకిలెయ్యమని నన్ను లేపాడు. పెద్దతేలు గోడమీద ఉంది. అది తన కొండెతో మా అబ్బాయి కాలుమీద గీస్తుందట. వీడు నిద్రలో తనకాలు అలా కదిలించినా ఆ తేలు కసికొద్దీ కుట్టి ఉండేదే. కానీ శ్రీ స్వామివారు ఆ సమయంలో వీనికి మెలుకువ ఇచ్చి ఆ తేలును గుర్తించేటట్లు చేశాడు. ఆ తేలు వీనిని కుట్టాలని వీని ప్రారబ్దంలో ఉంది. తేలువీనిని తాకింది. కానీ శ్రీ స్వామివారు దానికొండె నుండి విషాన్ని వీని కాలిలోకి ప్రవేశ పెట్టనివ్వలేదు. ఆ తేలును చంపకుండా కటింగ్ ప్లేరుతో పట్టుకొని దూరంగా చెట్లలో వదిలేశాను. ఈ తేలు బారినుండి శ్రీ స్వామివారు వాణ్ణి రక్షించాలని నేను గాని పిల్లవాడు గాని ప్రార్థన చేయలేదుగదా! ఇదే నిజమైన రక్షణ. అలాంటి రక్షణ కొరకే మనం వారు బోధించిన ధర్మమార్గంలో నడవ ప్రయత్నించాలి.

ఓ కరుణాసాగరా! మా అహంకారాన్ని సమూలంగాహరించి మీరు కోరిన ధర్మమార్గంలో మమ్ము నడిపించు తండ్రీ.

ఈ చరాచర జగత్తంతా తామైన సద్గురు మూర్తులు మన మనోభావాల కనుగుణంగా మనలను ధర్మమార్గంలో నడిపిస్తారు. స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా, క్యాషియర్ తలుపూరు - నెల్లూరు జిల్లా నివాసి శ్రీ వేలూరు రాజయ్య ఇలా తెలుపుతున్నారు.

"ఒకరోజు నా స్వప్నంలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు దర్శనమిచ్చి "అయ్యా! నీవు నన్నూ, శ్రీ షిరిడీసాయి బాబాను ఇద్దరినీ కొలుస్తున్నావు. ఆయన , నేను ఒకటేనయ్యా! నీవు సాయిబాబానే నమ్ముకోయ్యా! అని చెప్పి అదృశ్యమయ్యారు. ఇది శ్రీ స్వామివారి మహాసమాధి అనంతరం జరిగింది.

శ్రీ స్వామివారు మనమధ్య ఉండగా ఒకరోజు నన్ను ముదిగేడు అనే గ్రామానికి పిలిపించారు. రాత్రి ఏడుగంటలకు మదిగేడు చేరాను. శ్రీ స్వామివారు ఒక తాటి మట్ట ఇచ్చి దానిపైన పడుకొని నిద్రపొమ్మని, అందువల్ల ఒకగొప్ప గండం తప్పుతుందని చెప్పారు. నేనలాగే పడుకొని నిద్రపోయాను. నడిరాత్రివేళ మంచి కోడెత్రాచుపాము బుసకొట్టిన శబ్దం వినపడి మెలుకువ వచ్చి లేచాను. నన్ను సంభ్రమాశ్చర్యములలో ముంచిన దృశ్యం చూచాను. శ్రీ స్వామివారు తన అగ్నిహోత్రములోని మండే నిప్పుకణికలపై కూర్చొని తంబుర మీటుచున్నారు. కొద్ది క్షణాలలో నాకళ్ళుమూతలు పడి నిద్రపోయాను. అదృశ్యం ద్వారా నాకొక గొప్ప గండం తొలగించారనే ఆనందం కలిగి కృతజ్ఞతతో ప్రణమిల్లాను.

మనకు భవిష్యత్తులో రాబోవు అపదలు తెలియవు గనుక వాటిని తప్పించమని మనం శ్రీ స్వామి వారిని ప్రార్థించడం ఉండదు. శ్రద్ధాభక్తులుగల తన వారిని శ్రీ స్వామివారు అట్టి ఆపదల నుండి రక్షించి తీరుతారు. శ్రీ స్వామివారి నుండి అట్టి రక్షణ పొందడమే మనధ్యేయంగా నడవాలి. రాయపెద్ది వివేకానందగారు కోయంబత్తూరు - 58-13. సిద్ధాపుదూర్ వారికి ఉద్యోగం లేకుండా ఉండే రోజులలో వాళ్ళ అన్నగారు శ్రీ స్వామి వారి దారం కట్టి స్వామికృప అనే స్వామి వారి పుస్తకం చిన్నది ఇచ్చి పారాయణ చేసుకోమన్నాడు. శ్రీ స్వామివారి దయతో నెలకు ఇరవేల రూపాయల జీవితంలో ఉద్యోగం వచ్చింది. ఒకరోజు డ్యూటీకిపోబోతూ తన మోటారు సైకిల్ కిక్ కొట్టినాడు. కాలిబొటిన వ్రేలి గోరులేచి పోయి రక్తం కారుతుంది. డాక్టరు దగ్గర కెళ్ళి కట్టు కట్టించి శెలవు పెట్టి ఇంట్లో ఉన్నాడు. అరగంట తర్వాత తెలిసింది. తాను డ్యూటీకి వెళ్ళే ప్రాంతంలో మత కలహాలు రేగి హత్యలు, రైడింగులు జరుగుచున్నాయని తాను అక్కడికి వెళ్ళి ఉంటే తప్పక ప్రమాదానికి గురి అయి ఉండేవాడినని, తనను ఆ ఆపద నుండి తప్పించేందుకే కాలిగోరు పొగొట్టి శ్రీస్వామివారు ఆపారని తెలిసికొన్నాడు.

ఒకసారి ప్రమోషన్ ఇంటర్‌వ్యూకి వెళ్ళాడు. తనకంటే సర్వీసు ఉన్న మేధావులెందరో వచ్చారు. తానుమాత్రం శ్రీ స్వామివారి నామం పట్టుదలగా చేస్తూ కూర్చున్న చోటునుండి లేవలేదు. తన పేరు వెయిటింగ్‌లిస్ట్‌లో వేశారు. చివరకు తనను సెలెక్ట్ చేసిన ఆఫీసర్ ఆయన్ను కౌగిలించుకొని నీపట్టుదలకు చాలా సంతోషమని అభినందించాడట.

ఒకరోజు మధురలోని మీనాక్షమ్మ గారి గుడికి వెళ్ళాను. విపరీతమైన రద్దీ. బయటనుంచి నమస్కరించుకొని రాబోతున్నాను. ఒకముసలాయన ఒక దోవచూపి నేరుగా వెళ్ళమన్నారు. నేనుపోతుంటే ఎవ్వరూ అపలేదు. నావెనుకరాబోయినవారిని రానీకుండా పోలీసులు ఆపేశారు. అమ్మదర్శనం చేసుకొని వచ్చాను. నన్నాక్యూలో పంపేందుకు శ్రీ స్వామివారే ఆరూపంలో వచ్చారని నానమ్మకం.

మన పుణ్యము ఋణానుబంధాన్ని అనుసరించి శ్రీ స్వామివారి సేవచేసే భాగ్యం కల్గుతుంది. అది తెలిసి ఎన్ని కష్టాలనైనా సంతోషంగా భరించి వారిసేవలో ఉండగల్గినప్పుడే మన భవష్యత్తును మనమే చక్క బరుచుకొన్న వాళ్ళం అవుతాము. "వాళ్ళుండేదాన్ని బట్టిగదయ్యా మన ముండేది". అన్న శ్రీ స్వామివారి మాటకు నిదర్శనవేు ఈ యస్. మాలకొండయ్యగారి అనుభవము.

మాది నెల్లూరు జిల్లా గుండెమడకల గ్రామం. 1985 సం॥ ప్రాంతంలో నా ఆరోగ్యం బాగుండేదికాదు. మనసు స్థిమితం లేదు. వళ్ళంతా విపరీతంగా ఎప్పుడూ నొప్పులు. ఏపనీ చేయలేను. నావయస్సు ఇరవైసంవత్సరాలు. మాప్రాంతములో ఉండే మంత్ర, తంత్రాలు, దాటింపుల వాళ్ళందరి ప్రయత్నాలు విఫలమయ్యాయి. అనాసంద్రపుపేట ఔలియా దగ్గర ఏడువారములు సేవచేశాను. ఏమాత్రము గుణము లేక ఇంట్లోవాళ్ళు విసిగిపోయి నన్ను మెంటల్ మనిషి క్రింద జమకట్టి మానుకున్నారు. అట్టినిరాశా పరిస్థితులలో శ్రీ స్వామివారు తనపిలుపును పంపారు. మాటీచర్ భార్యకు చేయినొప్పి. ఎన్నో ఇంగ్లీషు మందులకు తగ్గకుంటే శ్రీ స్వామివారు బాగుచేశారు. ఆమె నన్ను శ్రీస్వామివారి దగ్గరకు పొమ్మని బలవంతంచేసింది. కాని నా పరిస్థితితో విసిగిపోయిన మా అన్నను ప్రాధేయపడి డబ్బుతీసుకొని శ్రీ స్వామివారి దగ్గరకొచ్చి ఒకే ఒక నిద్రచేసి వెళ్ళాను. ఇంటికి పోయిన రోజు నాస్వప్నంలో నన్నేదో గుద్దింది. నేను భయపడి నిద్రలేచాను. అంతే నామనసు స్థిమితమై నేను మామూలు మనిషినైనట్లు తెలుస్తుంది. నాగురించి మీరేమి భయపడవద్దు. నాకు బాగుంది. నేను శ్రీ వెంకయ్య స్వామి వద్ద నలభైరోజులు ఉండి వస్తానని గొలగమూడి వచ్చేశాను. అదిమొదలు నాకు ఆరోగ్యం చక్కబడింది. కానీ ఇంటికి పోవాలనే ధ్యాసేలేదు. కొన్నాళ్ళు వంట దగ్గర కొన్నాళ్ళు బేలుదారి వాళ్ళదగ్గరపని చేస్తున్నాను. ఒకనాడు నా స్వప్నంలో శ్రీ స్వామివారు "నీకు గార్డుపని ఇస్తా" నని చెప్పారు. కానీ ఇంట్లోవారి బలత్కారము పై అనేక సార్లు ఇంటికి వెళ్ళి అక్కడ ఉండాలని బుద్ధిలేక మరలా గొలగమూడి వచ్చేశాను. ఒకసారి నేను మా గ్రామంలో గొఱ్ఱెలు

మేపుతుండే సమయంలో ఒక స్వప్నం వచ్చింది అందులో నేను గొఱ్ఱెలు అమ్మినట్లు ఉంది. చిత్రంగా రాత్రి స్వప్నంలో ఎలా జరిగిందో అదే విధంగా గొఱ్ఱెలను అమ్మేశాను. మరలా కొన్నాళ్ళు శ్రీ స్వామిసేవ కొచ్చాక మరలా ఇంటికి పోయాను. ఇంట్లో ఒక స్వప్నం వచ్చింది. నేనొక ఏటివడ్డున సగం మంచం నీటిలోను సగం మంచం గట్టున ఉన్న మంచంమీద పడుకొని నిద్రపోతున్నాను. సమాధి మందిర పూజారినాగయ్య నన్ను నిద్రలేపి "అక్కడ పూజచేయమంటే ఇక్కడ ఉన్నావే" అంటూ మెడబట్టి నెట్టుకొంటూ చాలాదూరం చేలలో అడ్డదిడ్డంగా తీసుకొచ్చారు. ఆ తెల్లవారి ఇల్లువదలి శ్రీస్వామి దగ్గర కొచ్చేశాను. కొన్ని సంవత్సరాల తర్వాత మరలా ఇంట్లో వాళ్ళు బలవంతం చేసి ఇంటికి తీసుకపోయారు. డబ్బుకు ఆశపడి మైసూరులో కాంట్రాక్టు చేసే మాబంధువు దగ్గర పెట్టారు. మైసూరులో నాస్వప్నంలో నేను శ్రీస్వామి వారికి పాదనమస్కారం చేసినట్లు ఉంది. అంతే ఇక అక్కడ నిలువలేని విధంగా నాలో గొలగమూడి పోవాలనే ప్రేరణ కలిగింది. తెల్లవారి ఎవ్వరికీ చెప్పకుండా గొలగమూడి వచ్చేశాను. నా కొరకు వాళ్ళు శ్రమపడి ఆప్రాంతమంతా వెతుక్కొని మా స్వగ్రామం వచ్చి చూచారు. చివరకు గొలగమూడిలో నన్నుచూచి వెళ్ళారు. నేను అజ్ఞానం వలన వారిసేవ వదలి సంసారంలో పడబోయినా పరమకారుణ్య మూర్తి నాలోతగు ప్రేరణపెట్టి తన సేవలో నిలుపుకున్నారు. వారి సేవలో పొందే ఆనందం ఇంటి దగ్గర నేను పొందలేను. "వెయ్యి గొఱ్ఱెలలో ఉన్నా మన గొఱ్ఱెను కాలుబట్టి లాక్కొస్తానయ్యా" అన్న వారి మాట నాయందు నెరవేరింది. ఇట్లు యస్. మాలకొండయ్య.

## • భగవంతుడు మననుండి కోరేదేమిటి

మనకాలము మనస్సులను మాత్రమే కోరుచున్నాడు. ఇరవైనాలుగు గంటల రోజులో కనీసం ఒక అరగంట కాని ఒక గంటకాని భగవంతుని స్మరణకు కేటాయించడం మనవిధి. మొదటకాలం సమర్పిస్తుంటే మన ప్రవర్తనతో సంప్రీతుడైన భగవంతుడు మన మనస్సునుగూడా నిశ్చలం చేస్తాడు. గనుక నిత్యం ఒక నియమిత కాలంలో తప్పక భగవంతుని స్మరించడం అలవాటు చేసుకోవడం అనేది మనకు ఎనలేని శ్రేయస్సు నిచ్చే అలవాటు.

మనకు కష్టమొచ్చాక భగవంతునకు మ్రొక్కుబడి చెప్పుకొని పారాయణచేశాక కష్టంతీరడం ఒక స్వల్పమైన విషయం. అలాగాక మనకు కష్టం రాకముందే భగవంతుడు మనలను ఆదుకోవడం జరగాలి. అలా ఆదుకోవాలంటే మనం మన కాలము మనస్సులను నిత్యం ఒకే కాలంలో కొంతసేపైనా వారికి సమర్పించాలి. శ్రీ స్వామి వారికి ప్రదక్షిణలు చేస్తూనే ప్రక్కవారితో మాట్లాడు చుండడం మనకెంతో నష్టం గలిగించేపని. ఆకొద్ది సేపైనా మన మనస్సు శ్రీ స్వామి పై నిలిపి మాటలు మానితే ఎంతమంచిదో చూడండి.

అన్ని జీవుల ఆకలిరూపంలో నేనే ఉన్నాను. అంటారు కృష్ణపరమాత్మ. ఆ ఆకలితీర్చుకునే టప్పుడైనా భగవంతుని స్మరించి తరించమంటారు శ్రీస్వామివారు. ఎన్నో జీవుల సమిష్టికృషి ఫలితంగానే మనకు అన్నం లభిస్తుంది. ఆ జీవులలోని పరమాత్మ ఎడల కృతజ్ఞతాభావంతో సమృద్ధిగా కాకబలికి ఆహారం సమర్పించమని తన ఆచరణ ద్వారా బోధించారు శ్రీస్వామివారు. ఆబోధను యధాశక్తి ఆచరించి శ్రీ స్వామివారి కృప పొందుదాం.

శ్రీ స్వామివారు తన జీవిత కాలములో నిత్యం రెండు విషయాలు అడిగేవారు.

1. ప్రొద్దుకూకబోయేముందు "అయ్యా కట్టెలున్నాయా ?" రాత్రంతా అగ్నిహోత్రం వ్రేల్చాలిగనుక ముందుగానే జాగ్రత్త పడేవారు.

2. రాత్రి 8 గం॥ల ప్రాంతంలో "అయ్యా ! భజనవాళ్ళు రాలేదా ఇంకా?" గనుక భజనకు వారెంత గొప్పగా విలువనిచ్చేవారో ఆలోచించండి. దీనిద్వారా మన మెన్నిపనులు చేసుకున్నా నిత్యం భజన మనందరకు ఎంతముఖ్యమో యోచించాలి.

## పూజ ఎందుకు చేయాలి ?

పూజ చేయడంలోని అంతరార్థం తెలియకుంటే పూజచేయడం యాంత్రికమై అలాచేస్తుంటే మనకేదో అవుతుందనే భ్రమలో ఉంటాము. మన పరిస్థితిలో మార్పులేనందున కొన్నాళ్ళకు మనమే పూజచేయడం ఆపేస్తాము. భగవంతుడు సర్వము తెలిసినవాడు, సర్వత్రా ఉన్నవాడు, ఏమైనచేయగలవాడు, జీవుల ఎడల ఎంతో దలయగలవాడు అనేవిషయం తెలిసి ఉండాలి. శ్రీ స్వామివారు అట్టి భగవంతుడని తెలియాలి. మన పొగడ్తలతో మురిసిపోయే వెర్రివాడు కాదు. రాజకీయనాయకుడూకాదు. మన మనస్సు హృదయము, శ్రద్ధను ఆశించే జగత్పిత వారు. మన కాలము, మనస్సు మాత్రమే వారు నిజంగా మననుండి కోరేవి. మన కాలము,మనస్సు వారికి సమర్పించేందుకు ఉపయోగపడేదే పూజ. పూజలో చెప్పే మంత్రాల అర్థంతెలుసుకోవడం ముఖ్యం. తీరిక వేళలో ఊసుబోని కబుర్లతో కాలం వ్యర్థం చేసుకొని పాపం మూట గట్టుకొనే బదులు ఆమంత్రాల అర్థం మననం చేసుకుంటుంటే కొంతసేపు వారి స్మరణలో ఉండగలుగుతాము.

భగవంతుని నామాల అర్థం తెలుసుకొని స్మరిస్తుంటే ఉత్తమోత్తమ ఫలితం పొందడం తథ్యం. పూజ శారీరకము, వాచకము, మానసికంగా ఉంటుంది. ఏ తరగతికి చెందినవారికి అదిమంచిది. మన కాలము మనస్సు శ్రీస్వామి వారికి సమర్పించి వారికృప పొందుదాం! జైగురుదేవ!

**నామావళి** :-

1. **ఓం సర్వసమర్థ సద్గురు శ్రీ స్వామి నాథాయనమః** (9 సార్లు)
   ఏమైనాచేయ సమర్థుడైన శ్రీ సద్గురు స్వామి వారికి నమస్కారము
2. **ఓం గురుదేవ దత్తాత్రేయాయ స్వామి నాథాయనమః** (9 సార్లు)
   సృష్టికర్త బ్రహ్మ, పోషించు విష్ణువు, లయకర్త ఈశ్వరుడూ. ఈ మూడు అంశాలు ఒకే రూపంలో ఇముడ్చుకున్న వారే దత్తాత్రేయ స్వామి. ఆ దత్తాత్రేయ స్వామియే దేశకాలముల ననుసరించి శ్రీవెంకయ్యస్వామిగా అవతరించిన సద్గురు మూర్తికి నమస్కారము.
3. **ఓం విశ్వప్రాణాయ స్వామి నాథాయనమః**
   విశ్వము లోని గ్రహగోళాలన్నింటికి చలనము గలదు. చలనమే ప్రాణశక్తిగా మనము తలంచుచున్నాము. ప్రాణశక్తే, తానైన శ్రీ స్వామి వారికి నమస్కారము.
4. **ఓం పంచభూతాత్మ స్వరూపాయ నమః**
   భూమి, ఆకాశము, అగ్ని, నీరు, వాయువు రూపాలు గా ప్రకటమైన శ్రీస్వామి వారికి నమస్కారము.
5. **ఓం ప్రాణలింగ స్వరూపాయ నమః**
   విశ్వమంతటినీ క్రమబద్ధంగా నిలిపి నడుపు ప్రాణశక్తే తనరూపముగాగల శ్రీ స్వామివారికి నమస్కారము.
6. **ఓం విశ్వలింగాయనమః** :- విశ్వమే తన దేహముగాగల శ్రీ స్వామివారికి నమస్కారము.
7. **ఓం చిదంబరాయనమః**:- అంబరము అనగా వస్త్రము. చిదాకాశమే తన వస్త్రముగాగల శ్రీ స్వామికి నమస్కారము.
8. **ఓం బహిరంతర్వ్యాపినే నమః** :- మనబయట, లోపలా తానే ఉన్న శ్రీ స్వామి వారికి నమస్కారము.
9. **ఓం దేహస్థ హృది వ్యాపస్తేజోవాయురాకాశ స్వరూపాయ నమః**
   మన దేహములోని భూమి, ఆకాశము, వాయువు, అగ్ని నీరుగా ఉన్న శ్రీ స్వామి వారికి నమస్కారము.
10. **ఓం చిద్రూపాయ నమః**
    చైతన్య రూపుడైన శ్రీ స్వామివారికి నమస్కారము
11. **ఓం చైతన్యలింగాయ నమః**
    సమిష్టి చైతన్యరూపుడైన శ్రీ స్వామివారికి నమస్కారము
12. **ఓం సర్వ వ్యాపినే నమః**
    అంతటా వ్యాపించి యున్న శ్రీస్వామి వారికి నమస్కారము

13. **ఓం దిగంబరాయ నమః**
అంబరమనగా వస్త్రము. దిక్కులనే వస్త్రముగా గల శ్రీ స్వా॥

14. **ఓం కేవలాయ నమః**
తానొక్కడు తప్ప అన్యమేలేని శ్రీ స్వా॥

15. **ఓం విశ్వసాక్షిణే నమః**
ఈ విశ్వాన్నంతా సాక్షీ భూతుడుగా చూస్తున్న శ్రీ స్వా॥

16. **ఓం సర్వజీవస్వరూపాయ నమః**
అన్ని జీవుల రూపంలో నున్న శ్రీ స్వా॥

17. **ఓం నామరూపరహితాయ నమః**
ఏ పేరుగాని, రూపముగాని లేని శ్రీ స్వా॥

18. **ఓం సర్వనామ రూపిణే నమః**
అన్ని పేర్లు, అన్ని రూపములు తానే అయిన శ్రీ స్వా॥

19. **ఓం విశ్వరూపాయ నమః**
విశ్వమే తనరూపముగా గల శ్రీ స్వా॥

20. **ఓం విరూపాయ నమః**
స్వతహాగా ఒక రూపమంటూ లేని శ్రీ స్వా॥

21. **ఓం విరూపాక్షాయ నమః**
రూపము లేకున్ననూ, గుర్తించు స్వభావముగల శ్రీ స్వా॥

22. **నిర్గుణాయనమః** ఏగుణము లేని శ్రీ స్వా॥

23. **ఓం నిశ్చలాయ నమః**
అంతటా నిండియున్నందున - కదలుటకు వీలులేని శ్రీ స్వా॥

24. **ఓం చంచలాయ నమః**
వస్తువుల యొక్క, మనస్సు యొక్క చలనమే తన రూపముగా గల శ్రీ స్వా॥

25. **ఓం అరిషడ్వర్గ వినాశకాయ నమః**
భక్తులలోని కామము, క్రోదము, లోభము, మోహ, మద, మాశ్చర్యములను నశింపజేయు శ్రీ స్వా॥

26. **ఓం దృశ్యాయ నమః** - మనోదేహాదుల నుండి విశ్వము వరకు గల సర్వదృశ్యములు తానైన శ్రీ స్వా॥

27. **ఓం దృగ్రూపాయనమః**:- అట్టి దృశ్యమును చూచు చూపు తానైనట్టి శ్రీ స్వా॥

28. **ఓం హృదయాయనమః** :- దృక్కు, దృశ్యములు నేను అనెడు విషయము ఎవరివలన అనుభవమగునో అట్టి శ్రీ స్వా॥

29. **ఓం సర్వలోకాత్మకాయనమః** :- సర్వలోకములు తానేయైన శ్రీ స్వా॥

30. **ఓం సర్వలోక సాక్షిణేనమః** :- సర్వలోకములను ఆయాజీవుల హృదయముల నుండి అనుభవించు శ్రీ స్వా॥

31. **ఓం సర్వదేవతా స్వరూపిణేనమః**:- సకలదేవతలు తానైనా శ్రీ స్వా॥

32. **ఓం ఆకాశగమనాయనమః** :- సంకల్ప మాత్రమున కోరినచోట ప్రకటమవ గల శ్రీ స్వా॥

33. **ఓం గమనాగమన రహితాయ నమః** :- చలనమేలేని శ్రీ స్వా॥

34. **సర్వత్ర స్థితాయనమః** :- సర్వత్ర నిండియున్న శ్రీ స్వా॥

35. **ఓం సన్మాత్రాయనమః** :- సత్ లేక పరబ్రహ్మమే తానైన శ్రీ స్వా॥

36. **ఓం సర్వాధారాయనమః** :- సర్వమునకు ఆధారమైన శ్రీ స్వా॥

37. **ఓం నాథ నాథాయనమః** :- నాధసాంప్రదాయమునకు ప్రభువైన శ్రీ స్వా॥

38. **ఓం యోగాయనమః** :- యోగమే తన నిజస్థితియైనన శ్రీ స్వా॥

39. **ఓం యోగీశ్వరాయనమః** :- యోగులందరికి ప్రభువైన శ్రీ స్వా॥

40. **ఓం యోగయోగ్యాయనమః**:- యోగ సాధనకు కేంద్రముగా నిలుపుకొనుటకు యోగ్యుడైన శ్రీ స్వా॥

41. **ఓం యోగ గమ్యాయనమః** :- యోగ సాధన ద్వారా పొంద దగిన ఆత్మ తత్వమైన శ్రీ స్వామి॥

42. **ఓం సర్వయోగ స్వరూపాయనమః** :- హఠ, మంత్ర, రాజ, జ్ఞానయోగములే తన తత్వముగా గల శ్రీ స్వా॥

43. **సర్వయోగి స్వరూపాయనమః :-** యోగ రూపమున అందరు యోగులలో వెలుగొందు శ్రీ స్వా॥

44. **ఓం సిద్ధిదాయనమః :-** సాధనలో పరిపూర్ణతను ప్రసాదించు శ్రీ స్వా॥

45. **ఓం సిద్ధాయనమః :-** యోగ పరిపూర్ణులైన శ్రీ స్వా॥

46. **ఓంసిద్ధయోగినేనమః:-** సిద్ధయోగము ఒక ప్రత్యేక సాంప్రదాయము. అట్టి యోగమున పరిపూర్ణులైన శ్రీ స్వా॥

47. **ఓం సర్వ సిద్ధసేవితాయనమః :-** యోగములో పరిపూర్ణులైన మహాత్ములందరూ సేవించు శ్రీ స్వా॥

48. **సర్వసిద్ధి సేవితాయనమః:-** సర్వసిద్ధులూ పూజించు దత్తరూపుడగు శ్రీ స్వా॥

49. **ఓం విఘ్నరాజాయనమః :-** అశుభకార్యములకు విఘ్నములు కలిగించు విఘ్నరాజైన శ్రీ స్వా॥

50. **ఓం విఘ్నహంత్రేనమః:-** సత్కార్యములకు కలుగు విఘ్నములను నశింపజేయు శ్రీ స్వా॥

51. **ఓం విచిత్ర వేషాయనమః :-** తనదేమతమో సాంప్రదాయమో తెలియని వేషముగల శ్రీ స్వా॥

52. **ఓం చిత్త చాంచల్య వినాశాయనమః:-** భక్తుల చిత్త చాంచల్యము నసింపజేయు శ్రీ స్వా॥

53. **ఓం భేద వర్జితాయనమః:-** కుల, మత, జాతి భేదములేని శ్రీ స్వా॥

54. **ఓం కృపా నిధయేనమః:-** కృపకు మూలమైన శ్రీ స్వా॥

55. **ఓం కరుణామూర్తయేనమః :-** సకల జీవులపై గల కరుణయే రూపముగా గల శ్రీ స్వా॥

56. **ఓంసమదర్శినేనమః:-** అన్ని రూపాలలో ఒకే పరమాత్మ తత్వమును చూచు శ్రీ స్వా॥

57. **ఓం ఆత్మదర్శినేనమః :-** అన్నింటినీ, అందరినీ తన రూపముగా దర్శించు శ్రీ స్వామి॥

58. **ఓం పరమాత్మ స్వరూపాయనమః :-** అన్ని జీవులకు ఆత్మ స్వరూపమైన శ్రీ స్వా॥

59. **ఓం వర్షరూపక యజ్ఞకృతేనమః :-** వర్షము కురిపించుట ద్వారా ప్రకృతి యజ్ఞము నడుపు శ్రీ స్వా॥

60. **ఓం సకాల వర్షధాత్రేనమః:-** ప్రకృతి శక్తులను శాసించి సకాలమున వర్షము కురియునట్లు చేయు శ్రీ స్వా॥

61. **ఓం సద్ధర్మ సంరక్షకాయనమః :-** ఆత్మ ప్రాప్తికి ఆచరించవలసిన ధర్మమును భక్తుల చేత ఆచరింపజేయు శ్రీ స్వా॥

62. **ఓం సదాచార విగ్రహాయనమః :-** మూర్తీ భవించిన సదాచార సంపన్నుడైన శ్రీ స్వా॥

63. **ఓం ఆచార వర్జితాయనమః:-** ఎట్టి ఆచారము లేని శ్రీ స్వా॥

64. **ఓం రోగనివారణేనమః:-** తన్నాశ్రయించిన వారి రోగములు బాపు శ్రీ స్వా॥

65. **ఓం సర్వశాస్త్ర స్వరూపాయనమః :-** సర్వ శాస్త్రరూపములలో ప్రకటమైన శ్రీ స్వా॥

66. **ఓం సర్వాచార సంసేవితాయనమః :-** సర్వమతాచారములు ఏ పరమాత్మను సేవించునో అదే తానైన శ్రీ స్వా॥

67. **ఓం వేద వేద్యాయనమః :-** వేదములకు లక్ష్యార్థమైన శ్రీ స్వా॥

68. **ఓం వేదాత్మనేనమః :-** వేదములే తానైన శ్రీ స్వా॥

69. **ఓం వేదకర్త్రేనమః:-** జీవుల హితము కొరకు వేదములు సృష్టించిన శ్రీ స్వా॥

70. **ఓం వేదసంరక్షకాయనమః:-** వేదములను సదాకాపాడు శ్రీ స్వా॥

71. **ఓం యజ్ఞాయనమః :-** సృష్టియజ్ఞమే తానైన శ్రీ స్వా॥

72. **ఓం యజ్ఞపురుషాయనమః** :- సమిష్టి యజ్ఞమునకు కారణమైన చైతన్యరూపుడైన శ్రీ స్వా॥

73. **ఓం యజ్ఞభోక్త్రేనమః**:- అట్టి యజ్ఞము ద్వారా తృప్తి బొందు శ్రీ స్వా॥

74. **ఓం యజమానినేనమః**:- యజ్ఞము జరుగునట్లు శాశించు శ్రీ స్వా॥

75. **ఓం జ్ఞానయజ్ఞాయనమః** :- అజ్ఞాన సంస్కారములన్నీ ఏ జ్ఞాన యజ్ఞములో ఆహుతి చేయబడునో అట్టి జ్ఞానయజ్ఞ స్వరూపుడగు శ్రీ స్వా॥

76. **ఓం ధ్యానయజ్ఞాయ నమః** :- ద్యానమనెడి అగ్నిలో విక్షేపములను అవివేకము ఆహుతి చేయబడునో అట్టి ధ్యానరూపుడగు శ్రీ స్వా॥

77. **ఓం బోధయజ్ఞాయనమః**:- ఆధ్యాత్మబోధ రూపుడైన శ్రీ స్వామి॥

78. **ఓం భక్తి యాజ్ఞయనమః**:- సాధకులు ఏ భక్తియనెడి అగ్నిలో అన్య చింతలను ఆహుతిచేతురో అట్టి భక్తి రూపుడైన శ్రీ స్వా॥

79. **ఓం సృష్టియజ్ఞాయనమః** :- సృష్టియనెడి యజ్ఞరూపుడైన శ్రీ స్వా॥

80. **ఓం చిదగ్ని కుండాయనమః** :- తనచేతనాగ్ని నుండి సకల సృష్టినీ పుట్టించు శ్రీ స్వా॥

81. **ఓం విభూతయే నమః**:- విభునియొక్క మహిమయే విభూతి. అట్టి మహిమాన్వితమైన శ్రీ స్వా॥

82. **ఓం లీలాకల్పిత బ్రహ్మాండమండలాయనమః** :- తనలీలచేత బ్రహ్మాండములను సృష్టించిన శ్రీ స్వా॥

83. **ఓం సంకల్పిత సర్వలోకాయనమః** :- తన సంకల్పము చేత సర్వలోకములు సృష్టించిన శ్రీ స్వా॥

84. **ఓం ఆహారాయనమః**:- తాను సృజించిన జీవులకు తానే ఆహారమైన శ్రీ స్వా॥

85. **ఓం నిరాహారాయనమః** :- తనకుగా వేరు ఆహారము అవసరములేనట్టి శ్రీ స్వా॥

86. **ఓం తీర్థపాదాయనమః**:- సకల తీర్థములు తన పాదములందుగల శ్రీ స్వా॥

87. **ఓం తీర్థపాలకాయనమః**:- పుణ్య తీర్థముల పవిత్రతను కాపాడు శ్రీ స్వా॥

88. **ఓం త్రికాల జ్ఞానాయనమః**:- భూత, భవిష్యత్, వర్తమాన కాలముల నెరిగిన శ్రీ స్వా॥

89. **ఓం కాల రహితాయనమః**:- త్రికాలములూ మాయామాత్రమేనని ఎరిగిన శ్రీ స్వా॥

90. **ఓం దృక్ దృశ్యభేద వివర్జితాయనమః** :- ద్రృక్కు దృశ్యముల తానే ఉన్నట్లు ఎరిగి అట్టి భేదమునకతీతుడైన శ్రీ స్వా॥

91. **ఓం ప్రణవాయనమః** :- తనను ధ్యానించు వానిని పరమాత్మను చేర్చు ప్రణవ రూపుడైన శ్రీ స్వా॥

92. **ఓం శబ్ద రూపిణే పరం బ్రహ్మణే నమః** :- శబ్ద రూపుడూ, పరం బ్రహ్మరూపుడూ తానైన శ్రీ స్వా॥

93. **ఓం దేవాలయాయనమః** :- సకలదేవతలకూ నిలయమైన దేవాలయమేతానైన శ్రీ స్వా॥

94. **ఓం సర్వ ధర్మ సంసేవితాయనమః** :- సకల మత ధర్మములూ సేవించునట్టి శ్రీ స్వా॥

95. **ఓం సర్వధర్మ సంస్థాపకాయనమః** :- సర్వమత ధర్మములను నెలకొల్పిన శ్రీ స్వామి॥

96. **ఓం ధర్మ స్వరూపాయనమః** :- ధర్మమే తానైన శ్రీ స్వా॥

**97. ఓం అవధూతాయనమః :-** మాలిన్యములు సంపూర్ణముగా త్యజించినవాడే అవదూత అట్టి శ్రీస్వా॥

**98. ఓం లీలామానుష విగ్రహాయనమః :-** తన దివ్వలీలల చేత మానవులకు తనను తెలియజేసుకొను శ్రీ స్వా॥

**99. ఓం లీలా విలాసాయనమః :-** భక్త రక్షణ కొరకు తన దివ్వలీలలు ప్రకటించు శ్రీ స్వా॥

**100. ఓం స్మృతి మాత్ర ప్రసన్నాయనమః:-** భక్తులు హృదయపూర్వకముగా స్మరించినంతనే ప్రసన్నుడగు శ్రీ స్వా॥

**101. ఓం గొలగమూడి ఆశ్రమ వాసినే నమః:-** గొలగమూడి ఆశ్రమమునే తన ఆశ్రయముగా చేసుకున్నా శ్రీ స్వా॥

**102. ఓం భక్త భారభృతాయనమః :-** భక్తుల భారములను మోయు శ్రీ స్వా॥

**103. విశ్వప్రేరణాధి కారిణేనమః :-** విశ్వములోని సర్వప్రేరణలకు కారకుడైన శ్రీ స్వా॥

**104. సర్వప్రేరణాధి కారిణేనమః :-** సర్వప్రేరణలకు కారకుడైన శ్రీ స్వా॥

**105. సర్వసమర్ధాయనమః :-** సర్వముచేయ గల సమర్థులైన శ్రీ స్వా॥

**106. సచ్చిదానంద స్వరూపాయ నమః :-** సత్, చిత్, ఆనంద రూపులైన శ్రీ స్వా॥

**సత్** - అన్నికాలములందు ఉండునట్టి

**చిత్** - చైతన్యరూపుడు

**ఆనంద** - ఆనందమే స్వభావము.

**107. ఓం గురుభక్తి ప్రధాత్రేనమః :-** గురుభక్తి ప్రసాదించు శ్రీ స్వా॥

**108. ఓం ఆత్మ జ్ఞాన ప్రధాత్రేనమః :-** ఆత్మ జ్ఞానమును ప్రసాదించు శ్రీ స్వా॥

**మంగళహారతి :-**

మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే।
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళం॥
మంగళం వేద వేద్యాయ మేఘశ్యామలా మూర్తయే।
పుసాం మోహన రూపాయ పుణ్య శ్లోకాయ మంగళం॥
రామచంద్రాయ మంగళం రామ క్రిష్ణాయ మంగళం।
గురుదేవాయ మంగళం సద్గురు ధేవాయమంగళం॥

స్వామి వెంకయార్యాయ గొలగమూడి వాసాయ
మామకా భీష్టదాయ మహిత మంగళం॥
లోక నాధాయ భక్తలోక సంరక్షకాయ
నాగలోక స్తుత్యాయ నవ్య మంగళం ॥స్వామి॥
భక్త బృందవందితాయ బ్రహ్మస్వరూపాయ
ముక్తిమార్గ బోధకాయ పూజ్య మంగళం ॥స్వామి॥
సత్యతత్వ బోధకాయ సాధువేషాయతే
నిత్య మంగళ దాయ కాయ నిత్య మంగళం ॥స్వా॥

